సాక్షి
పార్వతీపురం మన్యం
మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



స్పందన దరఖాస్తులకు పరిష్కారం

స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రజా వినతుల పరిష్కారమే ప్రాధాన్యతా అంశంగా తీసుకోవాలని జిల్లా అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి దిశానిర్దేశం చేశారు.
- 8లో



అంబరాన్నంటిన సిరిమాను సంబరం

మెరకముడిదాం మండలంలోని ఆరుగ్రామాల గ్రామదేవతల సిరిమానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.
- 8లో

గంగానది పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

విజయనగరం టౌన్: పవిత్ర గంగానది పుష్కరాలకు వెళ్లాలనుకుంటున్న ప్రయాణికులకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. విజయనగరం నుంచి ఈనెల 30న ఉదయం 6గంటలకు బయలుదేరిని బస్సు నేరుగా వారణాశి వెళ్లి తిరిగి మే 3న విజయనగరం చేరుకుంటుందన్నారు.

న్యూస్‌రీల్

రక్తహీనత నివారణకు ప్రత్యేక కార్యాచరణ

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలోని శిశువులు, బాలికలు, గర్భిణులు, బాలింతలకు సంబంధించి రక్తహీనత నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. వైద్యారోగ్య శాఖ, విద్యాశాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు ఎం.టి కృష్ణబాబు, ప్రవీణ్ ప్రకాష్ పార్వతీపురం - మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిషాంత్‌కుమార్ పాల్గొన్నారు. రక్తహీనత నివారణకు రూపొందించిన కార్యాచరణను విజయవంతంగా అమలు చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీలు సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ బి.జగన్నాధరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త బి.వాగ్దేవి, ఆర్‌బీఎస్‌కే పీఓ డి.భాస్కరరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డీవీ రమణ పాల్గొన్నారు.

ఆదివాసీల జీవనంపై అధ్యయనం

- గిరిజన సంప్రదాయాలకు ఫిదా అయిన విదేశీ మహిళలు



ఆదివాసీ వ్యవసాయ పనిముట్లను పరిశీలిస్తున్న గ్లోబల్ గ్లో ఇండియా సంస్థ ప్రతినిధులు

భామిని: మండలంలోని మూలగూడ, మనుమకొండ, పాలవలస గిరిజన గ్రామాల్లో సోమవారం గ్లోబల్ గ్లో ఇండియా సంస్థ ప్రతినిధులు జింటా(న్యూయార్క్), పల్లవి(లక్నో)లు పర్యటించారు. హోలీక్రాస్ సంస్థ డైరెక్టర్ కె.ప్రభుదాస్‌తో కలిసి గిరిజన జీవనంపై అధ్యయనం చేశారు. వీరికి గిరిజనులు సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో స్వాగతం పలికారు. అనంతరం ఆదివాసీల సవర భాషకు అక్షరరూపం ఇచ్చిన మంగయ్య గుమాంగో గురించి తెలుసుకున్నారు. 24 సవర లిపి అక్షరాలను విగ్రహాలుగా ఆలయాలు కట్టి పూజలు చేయడాన్ని తెలుసుకొని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పురాతన వ్యవసాయ పద్ధతులు, సంప్రదాయ పంటలు, చిరుధాన్యాల సాగు వివరాలను ఆసక్తిగా తెలుసుకున్నారు. మహిళలకు కుట్టుశిక్షణ, అనాథ బాలల ఆశ్రమాల నిర్వహణ తీరుపై ఆరా తీశారు.

సమస్యల పరిష్కారానికి సానుకూలం

పార్వతీపురం: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. ఉపాధ్యాయ యూనియన్ల ప్రతినిధులు కలెక్టర్‌ను సోమవారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు విధి నిర్వహణలో భాగంగా చేస్తున్న కృషి, నూతన సాంకేతిక యాప్‌లను వినియోగించడంలో చూపుతున్న చొరవను ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఉపాధ్యాయులు మంచి సేవలు అందిస్తున్నారని, వారి డిమాండ్లను పరిగణలోకి తీసుకుని పరిశీలిస్తామన్నారు. విద్యార్థులకు అందాల్సిన పాఠ్యపుస్తకాల పంపిణీలో లోపాలు గుర్తిస్తామని తెలిపారు. జిల్లాలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి పర్యటనలో భాగంగా జరిగిన సస్పెన్షన్‌ల విషయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకటి, రెండు రోజుల్లో విచారణ పూర్తి చేస్తామని చెప్పారు. జిల్లాలో సానుకూల, స్నేహపూర్వక వాతావరణం ఉన్న సమయంలో సస్పెన్షన్లు విధించడం బాధించిందని ఎన్‌జీఓ నాయకుడు కిశోర్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో డీఆర్ ఓ జె.వెంకటరావు, ఇన్‌చార్జి డీఈఓ వెంకటేశ్వర రావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు బాలకృష్ణ, విజయ్, సింహచలం, ఆర్.శ్రీనివాసరావు, గోవిందరావు, సంజీవి, మురళీ, ధనుంజయ, తదితరులున్నారు.

చిత్రలేఖనంలో పతకాల పంట



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు

సీతంపేట: రాష్ట్ర స్థాయి చిత్రలేఖన పోటీల్లో సీతంపేట ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఎ.భవ్యశ్రీ, డి.అనుష్క, ఎస్.భవ్యశ్రీ, పి.లిఖితలు బంగారు పతకాలు సాధించగా, బి.జాన్, ఎన్. కార్తీక్, ఎస్.పుష్పనాథ్, కె.ఝాన్సీ, బి.మౌనిక, ఆర్.లిఖిత, వి.శరణ్యలు వెండిపతకాలను కైవసం చేసుకున్నారు. బెస్ట్ డ్రాయింగ్ టీచర్‌గా ఎ.శేషగిరి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం ఎ.శ్రీనివాసరావుతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

మన్యంలో మలేరియా మరణాలు నిల్



- నాలుగేళ్లుగా మలేరియా నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- ముందస్తుగా దోమల నివారణ మందు పిచికారీ
- ఊరూరా అవగాహన సదస్సుల నిర్వహణ
- మలేరియా పాజిటివ్ కేసులకు సత్వర వైద్యం
- 4లక్షలకు పైగా దోమ తెరల పంపిణీ
- వచ్చేనెల 15 నుంచి మలాథియన్ పిచికారీకి ఏర్పాట్లు
- నేడు ప్రపంచ మలేరియా దినం



దోమతెరల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సీతంపేట:

ప్రభుత్వ ప్రజారోగ్య చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. ప్రజలకు ఆరోగ్య భరాసా కలుగుతోంది. గతంలో మలేరియా పేరు వినగానే మన్యంవాసులు భయపడేవారు. సకాలంలో వైద్యసేవలు అందక మృతి చెందేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లుగా తీసుకుంటున్న మలేరియా నివారణ ముందస్తు చర్యలతో వ్యాధివ్యాప్తి అమాంతం తగ్గింది. మలేరియా బాధితులకు సకాలంలో వైద్యసేవలు అందడంతో మరణాల సంఖ్య నిల్‌గా మారింది. దీంతో మన్యం ప్రజలు ధైర్యంగా జీవించగలుగుతున్నారు. నేడు (మంగళవారం) ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

మలేరియా నివారణకు ముందస్తు చర్యలు


గిరిజన గ్రామాల్లో మలేరియా తగ్గుముఖం పట్టింది. గత నాలుగేళ్లలో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల్లో మలేరియాతో మరణాలు సంభవించిన దాఖలాలు లేవు. కేవలం మలేరియా పాజిటివ్ కేసులు నమోదైనా వెంటనే తగిన చికిత్సలు చేయడంతో రోగులు కోలుకుంటున్నారు. ఊరూరా, ఇంటింటా దోమల నివారణకు సింథటిక్ పైరాత్రియన్ మందును పిచికారీ చేయడం, దోమతెరల పంపిణీ చర్యలతో జిల్లాలో మలేరియా తగ్గుముఖం పట్టింది. మొత్తం 280 హైరిస్క్ మలేరియా గ్రామాలను ప్రభుత్వం గుర్తించింది. ఏటా రెండు దఫాలు దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తోంది. ఈ ఏడాది వర్షాకాలనికి ముందే వచ్చే నెల 15 నుంచి గ్రామాల్లో సింథటిక్ పైరాత్రియన్ మందు పిచికారీకి ఏర్పాట్లు పూర్తిచేసింది. అన్ని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాల్లోనూ దోమల నివారణ మందు పిచికారీ చేయనుంది. గిరిజనులకు ఇప్పటివరకు దాదాపు 4లక్షలకు పైగా దోమతెరలను పంపిణీ చేసింది.

మన్యంలో మలేరియా వ్యాప్తి ఇలా..

సంవత్సరం	మలేరియా పాజిటివ్ కేసులు
2020	98
2021	118
2022	502
2023 (ఇప్పటివరకు) (వైద్య సేవలతో అందరూ కోలుకున్నారు)	119



విద్యార్థులకు మలేరియాపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



మలేరియాకు దూరంగా ఉండాలంటే..

- ఇంటిలోపల, బయట నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. ఇంటి వాతావరణం పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- దోమతెరలు వినియోగించాలి. ఇంటి కిటికీలకు మెస్‌లు బిగించాలి.
- తాగిపడేసిన కొబ్బరి బొండాలు, వాడిన టైర్లు ఇంటి పరిసరాల్లో ఉంచకూడదు.
- వాటర్ ట్యాంకులకు మూతలు వేయాలి.
- మలాథియన్ స్ప్రేయింగ్ చేస్తే ఇంటిలోపల, బయట స్ప్రేయింగ్ చేయించుకోవాలి.

వ్యాధి లక్షణాలు

- మలేరియా సోకితే శరీర ఉష్ణోగ్రత పెరుగుతంది. కొన్నిసార్లు చలికూడా వస్తుంది. ఫాల్సిఫారమ్ మలేరియా తీవ్రంగా ఉంటుంది. జ్వరం వచ్చిన రెండుగంటలలోపు ఆస్పత్రిలో చేర్పించాలి.
- తలనొప్పి, ఒంటినొప్పులు, వణుకుతో కూడిన చలిజ్వరం, చెమటలు పట్టడం వంటి లక్షణాలతో బాధపడుతున్నవారికి రక్తపరీక్షలు చేయించాలి.
- జ్వరం రోజువిడిచి రోజు రావచ్చు. మలేరియా క్రిములున్న దోమ ఆరోగ్యవంతులకు కుట్టిన 10 నుంచి 14 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయట పడతాయి.
- జ్వరంతోపాటు వాంతులు కూడా అవుతుంటాయి.

మలేరియాకు దోమలే కారణం..

- అనాపిలిస్ అనే దోమ కుట్టడం వల్ల మలేరియా సోకుతుంది. జూన్ నుంచి అక్టోబర్ మధ్య కాలంలో ఎక్కువగా మలేరియా కారక దోమలు వ్యాప్తి చెందుతాయి.
- అనాపిలిస్ దోమ మలేరియా వ్యాధి క్రిమలను రోగి నుంచి ఆరోగ్యవంతులకు కూడా చేరవేస్తుంది.
- వర్షాకాల సీజన్‌లో తరుచూ వచ్చేవ్యాధి మలేరి యా. దీని లక్షణాలు ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకోవాలి.
- మలేరియా కారక సూక్ష్మ క్రిములు ప్లాస్మోడియం, వైవాక్స్ ప్లాస్మోడియంఫాల్సిఫారమ్, ప్లాస్మోడియం బవెల్, ప్లాస్మోడియం రూపంలో ఉంటాయి.



సింథటిక్ పైరాత్రియన్‌ను పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

మలేరియా నిర్మూలనకు పకడ్బందీ చర్యలు



మలేరియా నిర్మూలన కార్యక్రమాలను మన్యంలో పకడ్బందీగా అమలు చేస్తున్నాం. దోమల నివారణ మందును మొదటి విడత వచ్చేనెల 15 నుంచి, మలివిడత జూలై 15 తర్వాత చేపడతాం. ఇంటి పరిసరాలు, ఇళ్లలో దోమలనివారణ మందు పిచికారీకి ప్రజలు సహకరించాలి. గ్రామాల్లో క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో దోమల నివారణ మందు పిచికారీ సాగుతుంది.

– డాక్టర్ శ్యామ్‌కుమార్, జిల్లా మలేరియా నివారణ ఇన్‌చార్జి అధికారి

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

పార్వతీపురం: జిల్లాలో మలేరియా వ్యాప్తి జరగకుండా దోమల నివారణ మందులు మే, జూన్, జూలై నెలల్లో పిచికారీ చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. వివిధ అంశాలపై కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సోమవారం సమీక్షించారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేయాలన్నారు. జిల్లా అధికారుల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తేవాలని సూచించారు. వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాల (కస్టమ్ హైర్ కేంద్రాలు) ఏర్పాటుపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఆధార్ వివరాలను అప్‌డేట్ చేయడంలో అలక్ష్యం చూపొద్దన్నారు. విద్యుత్ విభాగాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్ తరచూ తనిఖీలు చేయాలని సూచించారు. ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్వో జె.వెంకటరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిలువునా నిర్లక్ష్యం

- పాఠ్య పుస్తకాల పంపిణీలో కొరవడిన పర్యవేక్షణ
- మండల విద్యాశాఖ కార్యాలయాల్లో గుట్టలుగా పాఠ్యపుస్తకాలు
- శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో 2.18 లక్షల మిగులు పాఠ్యపుస్తకాలు
- అధికారుల తీరుపై ఏపీ స్టేట్ టెక్స్ట్ బుక్స్ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి మండిపాటు



వీరఘట్టం ఎంఈఓ కార్యాలయంలో గుట్టలుగా ఉన్న పుస్తకాలను పరిశీలిస్తున్న స్టేట్ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి

వీరఘట్టం: విద్యార్థులకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠ్యపుస్తకాల పంపిణీలో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఏపీ స్టేట్ టెక్స్ట్ బుక్స్ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఈ నెల 20వ తేదీన విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ వీరఘట్టం మండలం రేగులపాడు కేజీబీవీని సందర్శించినప్పుడు 8వ తరగతి విద్యార్థులకు గణిత పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదనే విషయాన్ని గుర్తించారు. దీనికి బాధ్యులను చేస్తూ పార్వతీపురం మన్యం జిల్లా డీఈఓ ఎస్.డి.వి రమణతో పాటు వీరఘట్టం ఎంఈఓ పి.కృష్ణమూర్తి, కేజీబీవీ ఎస్ఓ రోహిణి, జీసీడీఓ రోజారమణిలను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. పాఠ్యపుస్తకాల పంపిణీలో లోపం ఎక్కడ జరిగిందో తెలుసుకునేందుకు కె.రవీంద్రనాథ్‌రెడ్డి వీరఘట్టం మండలానికి సోమవారం వచ్చారు. రేగులపాడు కేజీబీవీ, వీరఘట్టం ఎంఈఓ కార్యాలయంతో పాటు పలు ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీలు చేశారు. 8వ తరగతి గణిత పాఠ్యపుస్తకాలు వచ్చాయా లేదా అని ఆరా తీశారు. పలు తరగతులకు చెందిన సుమారు రెండు వేలకు పైగా పాఠ్యపుస్తకాలు వీరఘట్టం ఎంఈఓ కార్యాలయంలో పంపిణీ చేయకుండా ఉండడాన్ని ఆయన గుర్తించారు. ఈ పుస్తకాలు ఎందుకు పంపిణీ చేయలేదని ఎంఈఓ కృష్ణమూర్తిని ప్రశ్నించారు. వాస్తవానికి గత ఏడాది జూలై 25న 533 మంది 8వ తరగతి విద్యార్థులకు 560 పాఠ్యపుస్తకాలు రాగా, వీటిలో 452 తెలుగు మీడియం, 108 ఇంగ్లిషు మీడియం పుస్తకాలు వీరఘట్టం కార్యాలయానికి ఇచ్చినట్లు గుర్తించారు. వీటిలో 108 ఇంగ్లిష్ మీడియం పుస్తకాలు తమకు రాలేదని ఇక్కడ సిబ్బంది అప్పటిలో జిల్లా అధికారులకు ఫోన్‌లో తెలియజేసారన్నారు. ఆ మేరకు పాఠ్యపుస్తకాలు అందినట్లు రాతపూర్వకంగా అధికారుల వద్ద రుజువులు ఉన్నాయని చెప్పారు. వీరికి 108 పాఠ్యపుస్తకాలు అందలేదనే విషయానికి రుజువు లేకపోవడంతో చర్యలు తీసుకున్నట్లు స్టేట్ డైరెక్టర్ తెలిపారు.

క్షేత్రస్థాయిలో కొరవడిన పర్యవేక్షణ

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడిందని స్టేట్ డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఉన్నతస్థాయి అధికారులు వచ్చి పరిశీలించే వరకు ఏయే పుస్తకాలు విద్యార్థులకు అందజేశామన్న విషయం తెలియకపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. ఒక విద్యార్థికి విద్యా సంవత్సరం చివరి వరకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడం తప్పుకాదా అని నిలదీశారు. పాఠ్యపుస్తకాల పంపిణీకి ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తుంటే ఇక్కడ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యార్థులకు పంపిణీ చేయకుండా ఇంకా శ్రీకాకుళం బుక్ డిపోలో 2.18 లక్షల పాఠ్యపుస్తకాలు ఉన్నాయని, ఈ పుస్తకాలను ఎందుకు పంపిణీ చేయలేకపోయారని వారిని అడిగారు. అనంతరం జీసీడీఓ రోజారమణి, ఎంఈఓ కృష్ణమూర్తి, గతంలో ఉన్న ఎంఈఓ నారాయణస్వామి, కేజీబీవీ ఎస్ఓ, శ్రీకాకుళం బుక్స్ డిపో మేనేజర్ తదితరుల నుంచి ఆయన వివరణ తీసుకున్నారు. ఈ నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని చెప్పారు. ఆయన వెంట శ్రీకాకుళం డీఈఓ తిరుమల చైతన్య, పాలకొండ ఉప విద్యాశాఖ అధికారి విజయకుమారి తదితరులు ఉన్నారు.



రేగులపాడు కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న స్టేట్ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి

పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకం

- సచివాలయ వ్యవస్థతో స్థానిక సంస్థలు బలోపేతం
- పంచాయతీరాజ్ దినోత్సవ సభలో జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- ఉత్తమ సేవలందించిన జెడ్పీటీసీలు, ఎంపీపీలకు సత్కారం
- సర్పంచులకు పురస్కారాల ప్రదానం



ఉత్తమ పంచాయతీ అవార్డులు అందుకున్న సర్పంచ్‌లతో కలెక్టర్ నిషాంత్‌కుమార్

విజయనగరం గంటస్తంభం:

ప్రభుత్వ పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకమని, స్థానిక సంస్థలు ద్వారా సుపరిపాలన అందుతుందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలను జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ప్రజలకు ఉత్తమ సేవలందించిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలను సత్కరించారు. వివిధ పరిపాలనా, సేవా సంబంధిత అంశాల్లో వినూత్న రీతిలో ప్రగతి సాధించిన 27 గ్రామ పంచాయతీలు జిల్లా స్థాయి అవార్డులకు ఎంపికకాగా, ఆయా గ్రామ సర్పంచులు అవార్డులు స్వీకరించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థతో స్థానిక సంస్థలు మరింత బలోపేతమయ్యాయని, ప్రభుత్వ సేవలు ప్రజలకు అత్యంత చేరువయ్యాయని తెలిపారు. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సిద్ధించిందన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్నట్లుగా గ్రామ సచివాలయాల ద్వారా సామాన్యులకు జవాబుదారీ తనంతో కూడిన పారదర్శకమైన సేవలు అందుతున్నాయని కితాబిచ్చారు. ప్రజా ప్రతినిధులు స్థానిక సంస్థల ప్రాముఖ్యతను తెలుసుకొని ప్రజలకు మరిన్ని ఉత్తమ సేవలందించాలని, మహిళా ప్రతినిధులు ప్రజాసేవలో భాగస్వామ్యం కావాలని, స్వతంత్రంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ముందుగా జెడ్పీ చైర్మన్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ నుంచి పారదర్శక పాలన అందజేస్తున్న జెడ్పీ చైర్మన్‌ను జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్, డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, డీపీఓ శ్రీధర్‌రాజా ఇతర అధికారులు సత్కరించారు.

సత్కారం పొందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు

బొబ్బిలి జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతకుమారి, నెక్కల శ్రీదేవి(కొత్తవలస), గొర్లి సుజాత (కురుపాం), లెంక సన్యాసి అప్పలనాయుడు(మెంటాడ), బలగ రేవతమ్మ (పార్వతీపురం)ను జెడ్పీ చైర్మన్ సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అలాగే, గంట్యాడ ఎంపీపీ పీరుబండి హైమావతి, ఉరిటి రామారావు(గరుగుబిల్లి), బడ్నాన ప్రమీల(పాచిపెంట), నర్సపల్లి ఉమాలక్ష్మి(తెర్లాం), మామిడి అప్పలనాయుడు (విజయనగరం)లను జెడ్పీ చైర్మన్ సత్కరించి జ్ఞాపికలను బహుకరించారు. వీరితో పాటు జెడ్పీ సీఈఓ, డీపీఓ, డీఎల్డీఓ, పంచాయతీ రాజ్ ఇతర అధికారులను కూడా సన్మానించారు.

విభాగాల వారీగా పురస్కారం పొందిన పంచాయతీలు

పేదరికంలేని జీవనోపాధిని మెరుగుపర్చడం: నెమలాం (తెర్లాంమండలం), చినబొండపల్లి (పార్వతీపురం), దబ్బిరాజుపేట(వేపాడ).

ఆరోగ్యవంతమైన గ్రామం: జీఎల్ పురం, మొరకముడిదాం నుంచి గర్భాం, గంట్యాడ నుంచి కొండ తామరాపల్లి.

బాలల స్నేహ పూర్వక గ్రామం: సతివాడ(తెర్లాం), సారిపల్లి(నెల్లిమర్ల), గొపాలరాయుడు పేట(బొబ్బిలి).

పుష్కలమైన నీటి వనరులున్న గ్రామం: జోగంపేట(సీతానగరం), కె.పాలవలస(గరివిడి), సీతారామపురం(ఎస్.కోట).

పచ్చదనం పరిశుభ్రత జాకేరు(వేపాడ), ముకుందపురం, జోగంపేట(సీతానగరం).

స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు ఉన్న గ్రామం: పెదగొట్టిలి(కురుపాం), గరుగుబిల్లి, గోపాలరాయుడుపేట (బొబ్బిలి).

సామాజిక భద్రత: కొత్తపల్లి(గరుగుబిల్లి), రామభద్రపురం, బొబ్బిలి నుంచి ఎం.భూర్జవలస.

సుపరిపాలన కేటగిరీ: మిర్తివలస, పెదపెంకి (బలిజిపేట), జోగంపేట(సీతానగరం),

మహిళల స్నేహ పూర్వక గ్రామం, అభివృద్ధికి శ్రీకారం కేటగిరీ: సీతారామపురం (ఎస్.కోట), జానుమల్లువలస, దయానిధిపురం(సీతానగరం).



హాజరైన ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

పార్వతీపురం: అంకితభావంతో పనిచేసి మంచి సేవలు అందిస్తే కచ్చితంగా గుర్తింపు వస్తుందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో ప్రకటించిన ఉత్తమ గ్రామ పంచాయతీల సర్పంచులకు బహుమతులను అందజేశారు. అవార్డులు పొందిన 14 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లను కలెక్టర్ అభినందించారు.



గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్మన్

క్లుప్తంగా

మైలాన్‌లో ప్రమాదం

• ఇద్దరు ఎన్‌ఎంఆర్ కార్మికులకు గాయాలు


ప్రమాదంలో గాయపడిన కార్మికులు

పూసపాటిరేగ: మండలంలోని గైతుల చోడవరంలో గల మైలాన్ పరిశ్రమలో గురువారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు ఎన్ఎంఆర్ కార్మికులకు గాయాలయ్యాయి. పరిశ్రమంలో ఎంబి 8ఎలో బ్యాచ్ వేస్తుండగా మంటలు చెలరేగడంతో విధులు నిర్వహిస్తున్న కనిమెల్లకు చెందిన దురగాసి రామకృష్ణ, తాడివాడకు చెందిన రమేష్‌కు గాయాలపాలయ్యారు. గాయపడిన వారిని విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈమేరకు పూసపాటిరేగ ఎస్సై ఎ.నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బొబ్బిలి: పట్టణ పరిధిలోని పాత బొబ్బిలిలో అన్నదమ్ముల మధ్య తలెత్తిన స్థల వివాదంలో సొంత అన్నపై తమ్ముడు పెట్రోల్ పోసి నిప్పంటించిన ఉదంతంలో తీవ్ర గాయాల పాలైన అన్న గుణుపూరు కృష్ణ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇప్పటికే నిందితుడు గోపాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: ఆరోగ్య సమస్యలతో సతమతమవుతూ కొద్దిరోజులుగా ఇబ్బందులు పడుతున్న మహిళ జీవితంపై విరక్తి చెంది ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు సోమవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక బింగివీధిలో నివాసం ఉంటున్న కంటుభుక్త ప్రశాంతి (26) ఏడాది క్రితం ఇంట్లో జారిపడిపోయింది. అప్పటి నుంచి వెన్ను సమస్యతో పాటు పలు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో మానసికంగా కుంగిపోయింది. గడిచిన రెండురోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందింది. ఇంటికి వచ్చిన ఆమె మనస్తాపం చెంది, ఆరోగ్య సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతుండడంతో చేసేది లేక ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త సేల్స్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఆ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. మృతురాలి తల్లి రామయ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజు తెలిపారు.

పిడుగుపాటుతో రెండు ఆవులు మృతి


మృతిచెందిన ఆవుల వద్ద రోదిస్తున్న యజమాని, పక్కనే ఆవులను పరిశీలిస్తున్న ఎ.డి జయప్రకాష్

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామంలో పిడుగుపాటుకు గురై రెండు ఆవులు ఆదివారం రాత్రి మృతిచెందాయి. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో గ్రామానికి చెందిన మీసాల పార్వతి తన రెండు ఆవులను కళ్లం వద్ద కట్టింది. అయితే వర్షం కురుస్తుండడంతో ఆవులను శాలలో కట్టేందుకు కుమారుడు వెంకటరమణ వస్తుండగా కొద్దిదూరంలో ఉండగా ఆవులపై పిడుగు పడి మృతిచెందడాన్ని గమనించి కుటుంబసభ్యులకు తెలియజేశాడు. కుటుంబ పోషణలో భాగమైన ఆవులు మృతిచెందడంతో పార్వతి లబోదిబోమంటూ రోదించింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబసభ్యులతోపాటు గ్రామస్తులు కోరుతున్నారు. విషయం తెలిసిన వెంటనే పశుసంవర్ధకశాఖ ఎ.డి బొత్స జయప్రకాష్ సంఘటనా స్థలానికి సోమవారం చేరుకుని పశువుల కళేబరాలను పరిశీలించారు.

పిడుగుపడి వ్యక్తి..


మృతి చెందిన అప్పలస్వామి

గజపతినగరం రూరల్: మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన నాగిరెడ్డి అప్పలస్వామి (72) సోమవారం మధ్యాహ్నం పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. ఈ మేరకు సచివాలయ కార్యదర్శి ఊర్మిళ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అప్పలస్వామి పొలంలో పని చేస్తున్న సమయంలో పిడుగు పడింది. ఈ సంఘటన జరిగిన వెంటనే గజపతినగరంలోని సీహెచ్‌ఎన్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,710–00
బంగారం(22సి. 10గ్రా.)	55,650–00
వెండి (కిలో)	80,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹117	₹204	₹ 214

వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం

• అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి దిశానిర్దేశం


సమస్యలను వింటున్న కలెక్టర్ నాగలక్ష్మి ఎస్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న దిశ మహిళా పీఎస్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రజా వినతుల పరిష్కారమే ప్రాధాన్యతా అంశంగా తీసుకోవాలని జిల్లా అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో వచ్చే వినతుల పరిష్కారాన్ని అత్యంత ముఖ్యమైన అంశంగా భావించాలని అధికారులకు స్పష్టం చేశారు. నిర్ణీత వ్యవధిలోనే వినతుల పరిష్కారం జరగాలని, ఈ విషయంలో జాప్యాన్ని సహించేది లేదన్నారు. ఎక్కువగా వస్తున్న వినతులను సబ్జెక్టు వారీగా ప్రాంతాల వారీగా విశ్లేషించి ఎక్కువగా ఎందుకు వస్తున్నాయి, ఎక్కడ లోపాలున్నాయనే అంశాలను గుర్తించి ఆ ఏరియాలో ఎక్కువ దృష్టి పెట్టి ప్రత్యేకంగా పరిష్కరించాలని సూచించారు. దీని వల్ల భవిష్యత్తులో వినతుల సంఖ్య తగ్గ ముఖం పట్టవచ్చని అభిప్రాయ పడ్డారు. మండల ప్రత్యేకాధికారులు తమ పర్యటనలలో స్పందన వినతుల పరిష్కారాన్ని తనిఖీ చేయాలని ఏఏ సబ్జెక్టులకు ఎక్కువగా వస్తున్నదీ వాటిని ఎలా పరిష్కరిస్తున్నదీ, రీ ఓపెన్ అయినవి తదితర అంశాలపై ఫీడ్ బ్యాక్ అందించాలని సూచించారు. సచివాలయాలలో వినతుల పరిష్కారం తీరు ఎలా జరుగుతున్నదీ దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు.

స్పందనకు 165 వినతులు

కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 165 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 117 ఉన్నాయి. హౌసింగ్ 5, మున్సిపల్ శాఖ 6, డీఆర్‌డీఏ 13, మిగిలినవి ఇతర శాఖలకు చెందిన వినతులున్నాయి. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మలత, సూర్యనారాయణ, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి లావణ్య, పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఫిర్యాదులపై తక్షణ చర్యలు

విజయనగరం క్రైమ్: స్పందన' ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని విజయనగరం దిశ మహిళ పీఎస్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించేందుకు 'స్పందన' కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. 'స్పందన' కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ35 ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో డీసీసిఆర్బీ సీఐ జె. మురళి, ఎస్బీ సీఐ ఇ.నర్సింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సిరిమాను సంబరం


గర్భాంలో సిరిమానోత్సవం జరుగుతున్న దృశ్యం


సిరిమాను అధిరోహించిన పూజారి పల్లేడ అప్పలనాయుడు

• ప్రత్యేకపూజలు నిర్వహించిన జెడ్పీచైర్మన్
• మొక్కలు చెల్లించుకున్న మహిళలు, భక్తులు

మెరకముడిదాం: గ్రామదేవతల సిరిమానోత్సవం అంగరంగవైభవంగా జరుగుతుండడం చూసిన భక్తులు కళ్లలో ఆనందానికి అవధులు లేవు. మెరకముడిదాం మండలంలోని పెదమంత్రిపేట, గర్భాం, చినమంత్రిపేట, లెంకపేట, బోడందొరవలస, నరసయ్యపేట గ్రామాలకు చెందిన గ్రామదేవతలు శ్రీతాడమ్మతల్లి, శ్రీబంగారమ్మతల్లిల జాతర సందర్భంగా సోమవారం సాయంత్రం పూజారి పల్లేడఅప్పలనాయుడు ఇంటివద్ద సిరిమానుకు జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం పల్లేడఅప్పలనాయుడు సిరిమానును అదిరోహించారు. అక్కడినుంచి ప్రారంభమైన సిరిమానోత్సం రాజుల వీధిగుండా ప్రధానరహదారిలో రామాలయంవైపు నుంచి వినాయకుడి ఆలయం వరకూ వెళ్లి అక్కడి నుంచి తిరిగి రామాలయం వరకూ రావడంతో అక్కడ నిలిపివేశారు. సిరామానోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు సుమారు 2లక్షలు మందికి పైగా వచ్చారు. సిరిమానోత్సవంలో మహిళలు చీరలు, పసుపు, కుంకుమలను అమ్మవారికి సమర్పించేందుకు పోటీపడ్డారు. అలాగే సిరిమనోత్సవానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చీపురుపల్లి డీఎస్పీ మోహన్‌రావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసారు. రాష్ట్రవిద్యాశాఖామంత్రి బొత్ససత్యనారాయణ కుమారుడు బొత్ససందీప్‌బాబుకు చెందిన ధీరస్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ట్యాంకుల ద్వారా గ్రామస్థులకు అవసరమైన తాగునీటిని సరఫరా చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, ఎంపీపీ తాడ్డికృష్ణవేణి, తాడ్డివేణుగోపాల రావు, కోట్లవిశ్వేశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

స్పందన దరఖాస్తులకు సత్వర పరిష్కారం

• పార్వతీపురం మన్యం కలెక్టర్ నిషాంత్ కుమార్


వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురం: స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చే అర్జీలపై వారితో నేరుగా మాట్లాడి వారు సంతృప్తి చెందేవిధంగా పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు స్పందన కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు ప్రజల నుంచి 94 అర్జీలను స్వీకరించారు.

అర్జీల వివరాలు ఇలా..

- కొమరాడ మండలం మర్రిగూడ గ్రామంలో పాఠశాల, అంగన్వాడీ భవనాల నిర్మాణం పూర్తి కాలేదని దానివల్ల పిల్లలు చదువులకు అంతరాయం కలుగుతోందని వాటి నిర్మాణం వెంటనే చేపట్టాలని గ్రామానికి చెందిన నిమ్మక చంద్రశేఖర్ దరఖాస్తు అందజేశారు.
- కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో చాలా దీనంగా నడుస్తోందని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల నీడ కోసం టెంట్స్, మంచినీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలని, పనిలోకి రాని వారికి కూడా హాజరు వేస్తున్నారని దీనిపై చర్యలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అర్జీ అందజేశారు.
- కొమరాడ మండలం సివిని గ్రామంలో రీ-సర్వే జరిపించి పాస్ పుస్తకాలు ఇచ్చారని కానీ వాటిలో అనేక పొరపాట్లు ఉన్నాయని, తప్పులను సవరించాలని, కొంతమందికి ఇప్పటికి పాస్ పుస్తకాలు రాలేదని గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు.
- జియ్యమ్మవలస మండలం వీరభ్రహ్మేంద్రపురం గ్రామానికి విద్యుత్ సమస్య అధికంగా ఉందని సమస్యను పరిష్కరించి గ్రామానికి విద్యుత్ సరఫరా చేయాలని గ్రామస్తుడు వి.రామకృష్ణ దరఖాస్తు అందజేశారు.

కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథ రావు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎ.ఈశ్వర రావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్, పీఆర్ ఎస్ఈ ఎంవీజీ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఒ.ప్రభాకర రావు, హౌసింగ్ పీడీ పి.రఘురాం, డ్వామా పీడీ కె.రామ చంద్రరావు, పౌర సరఫరాల సంస్థ డీఎం ఎం.డి.నాయక్, జిల్లా సరఫరా అధికారి కేవీఎల్ఎన్ మూర్తి, ఐసీడీఎస్ పీడీ విజయగౌరి, జిల్లా మలేరియా అధికారి కె.పైడిరాజు పాల్గొన్నారు.

గడువులోగా సమస్యల పరిష్కారం

పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి వారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చని, వాటిపై చట్టపరిధిలో విచారణ చేపట్టి నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఒ. దిలీప్‌కిరణ్, దిశ డీఎస్పీ ఎస్ఆర్ హరిత, ఏఆర్‌డీఎస్పీ బి.నాగేశ్వరరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎస్వీ ప్రభాకర్, ఎస్సై పి.దినకర్ తదితరులు పాల్గొన్నారు.

'లోక్ ఓఎస్' యాప్‌పై శిక్షణ ప్రారంభం


శిక్షణలో భాగంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేస్తున్న శిక్షకుడు

విజయనగరం అర్బన్: స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీలు పరింత పారదర్శకంగా నిర్వహించడానికి అవసరమైన 'లోక్ ఓఎస్' యాప్‌పై సెర్ప్ సిబ్బందికి ఈ నెల 29వ తేదీ వరకు రెండు విడతలుగా నిర్వహించనున్న శిక్షణ తరగతులు స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ జిల్లాలోని మండల సమాఖ్య, గ్రామ సంఘం ప్రొఫైల్, ఆర్థిక లావాదేవీలు, స్వయం సహాయక సంఘాలు, సంఘ సభ్యుల ప్రొఫైల్, నెలవారీ జరిగే ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా ఆన్‌లైన్‌లో క్రోడీకరించేందుకు ఈ యాప్ రూపొందించారని తెలిపారు. తొలుత జిల్లా స్థాయి సిబ్బందికి ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. యాప్‌పై పూర్తి అవగాహన పెంచుకుని సమాచారాన్ని తప్పులు లేకుండా నమోదు చేయాలని కోరారు. శిక్షణ పొందిన వారు మండల స్థాయిలో గ్రామ సంఘ సహాయకులకు శిక్షణ ఇవ్వవలసి ఉందన్నారు.

వైఎస్సార్‌సీపీలో నూతన నియామకాలు

విజయనగరం: పార్టీ బలోపేతమే ధ్యేయంగా వైఎస్ఆర్‌సీపీ అధిష్టానం నూతన నియామకాలు చేపట్టింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. నియామక ప్రక్రియలో భాగంగా విద్యార్థి విభాగం విజయనగరం, విశాఖ, అనకాపల్లి జోన్‌కు సంబంధించి ఎస్సీ సెల్ ఇన్‌చార్జిగా విశాఖకు చెందిన రెల్ల జానకిరావు, శ్రీకాకుళం, పార్వతీపురం, అల్లూరి జిల్లాలకు సంబంధించి రాజాం నియోజకవర్గానికి చెందిన కంబాల సందీప్‌లను నియమించింది. అదేవిధంగా పార్వతీపురం-మన్యం జిల్లా క్రిస్టియన్, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పాస్టర్ మర్రాపు శ్రీనివాసరావును నియమిస్తున్నట్లు పార్టీ అధిష్టానం ఉత్తర్వుల్లో పేర్కొంది.

ప్రత్యేక ఉపాధ్యాయ ఖాళీలు తక్షణమే భర్తీ చేయాలి


మంత్రి బొత్ససత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఉత్తరాంధ్ర విద్యార్థి సేన నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: విద్యా హక్కు చట్టం -2009, చట్ట సవరణ అనుసరించి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 6,800 ప్రత్యేక ఉపాధ్యాయ ఖాళీలు తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి రమణ మూర్తి, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ఏయూ ఇన్‌చార్జి సుబుద్ధి శ్రీరామ్, జి. ఉదయ్ , ఎం.సన్యాసి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుధాటికి భార్యాభర్తలకు గాయాలు

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం పిడుగుపాటుకు భార్యాభర్తలు గాయాలపాలయ్యారు. బొబ్బిలికి చెందిన పి.గణేష్, కృష్ణవేణిలు శ్రీకాకుళం జిల్లా పొందూరులోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామం ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. పొగిరి వద్దకు వచ్చేసరికి సమీపంలో పిడుగు పడింది. పిడుగుధాటికి ద్విచక్రవాహన అద్దాలు పగిలిపోవడంతో గాజు ముక్కలు ముఖం, ఒంటిపైన తగలడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు గమనించి భార్యాభర్తలను ఆటోలో రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తికి..

రాజాం మున్సిపాల్టీ పరిధి గాయత్రికాలనీ వద్ద సోమవారం రెండు బైక్‌లు ఢీకొనడంతో ఓ వ్యక్తి గాయాల పాలైనట్లు ఎస్సై పి.నీలావతి తెలిపారు. కొత్తవలస గ్రామానికి చెందిన రుగడ జగన్నాథం రాజాం నుంచి స్వగ్రామం బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా రాజాం వస్తున్న మరో ద్విచక్రవాహనదారుడు పి.కామేశ్వరరావు ఢీకొన్నాడు. దీంతో గాయపడిన జగన్నాథాన్ని స్థానికులు రాజాం సామాజిక ఆస్పత్రిలో చేర్పించి చికిత్స నందించారు.

రెండు సెల్‌ఫోన్లు చోరీ

చీపురుపల్లి: పట్టణంలోని కార్యాలయాల్లో ఓ దొంగ చొరబడి రెండు సెల్‌ఫోన్లు చోరీ చేశాడు. వివరాలిలా ఉన్నాయి. సోమవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో జెడ్పీటీసీ కార్యాలయంలో పని చేసే సహాయకుడు సంతోష్ కార్యాలయం తాళాలు తీసి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించే సమయంలో అప్పటికే వెనుక డోర్ నుంచి లోపలికి ప్రవేశించి ఉన్న దొంగ సంతోష్‌పై మారణాయుధంతో దాడి చేసేందుకు ప్రయత్నించగా భయాందోళనకు గురైన సంతోష్ మెయిన్‌రోడ్ వైపు పరుగులు తీశాడు. దీంతో అక్కడే ఉన్న సంతోష్ సెల్, అంతకుముందు సచివాలయం-2లోకి ప్రవేశించిన దుండగుడు అక్కడొక సెల్ అపహరించుకుపోయాడు. అయితే దుండగుడు చోరీకి వచ్చిన సమయంలో తీసుకొచ్చిన కత్తి జెడ్పీటీసీ కార్యాలయం ఆవరణలో పడి ఉండడంతో దాన్ని పోలీస్‌స్టేషన్‌కు సంతోష్ అప్పగించి చోరీ సమాచారం తెలియజేశాడు.

నీరు నిల్వ ఉండకుండా చూడాలి

• డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమణకుమారి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి హితవు పలికారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రపంచ మలేరియా నివారణ దినాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు చెప్పారు. మలేరియా వ్యాధి పూర్తి స్థాయిలో నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దోమ తెరలను ప్రతి ఒక్కరూ వినియోగించాలని పిలుపునిచ్చారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. సమావేశంలో డీఎంఓ డాక్టర్ తులసి, ఏఎంఓ డి.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా అచ్చిబాబు

విజయనగరం ఫోర్ట్: కాంగ్రెస్ పార్టీ విజయనగరం జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడిగా చీమల అచ్చిబాబు నియమితులయ్యారు. ఈమేరకు పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు సోమవారం నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు శాంతికుమారి, డీసీసీ అధ్యక్షుడు రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధిలోని వంజరాంపేట గ్రామంలో పదేళ్లుగా నివాసం ఉంటున్న బోని సూర్యారావు (65) అదృశ్యంపై సోమవారం కేసు నమోదుచేశామని ఎస్సై వీబీ రామకృష్ణ తెలిపారు. ఈ నెల 20న ఇంట్లో ఎవరూలేని సమయంలో వృద్ధుడు ఎటో వెళ్లిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు గ్రామంతోపాటు చుట్టుపక్కల తెలిసినవారు, బంధువుల ఇళ్లల్లో వెతికారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడవంతో కుమారుడు దేవదాసు ఫిర్యాదు చేశాడని ఎస్సై తెలిపారు. వృద్ధుడికి ఏడాదికాలంగా ఆరోగ్యంగా బాగాలేకపోవడంతోపాటు మతిస్థిమితం సరిగా లేక ఆస్పత్రిలో మందులు వాడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

స్కూటీ అదుపు తప్పి యువతి మృతి

• మరో యువతికి గాయాలు


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పిన్నింటి లక్ష్మి


చికిత్స పొందుతున్న అనూష


లక్ష్మి (ఫైల్)

గుమ్మలక్ష్మీపురం: ఇద్దరు ఉద్యోగినులు ద్విచక్రవాహనంపై (స్కూటీ) వెళ్తుండగా వాహనం అదుపుతప్పి బోల్తాపడడంతో వెనక కూర్చున్న ఓ ఉద్యోగిని మృతి చెందింది. స్కూటీ నడుపుతున్న మరో ఉద్యోగిని తీవ్ర గాయాల పాలైంది. ఈ ప్రమాదం గుమ్మలక్ష్మీపురం మండలంలో సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మక్కువ మండలం మార్కొండపుట్టి గ్రామానికి చెందిన పిన్నింటి లక్ష్మి (23) గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేట గ్రామ సచివాలయం-1లోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో ఎంఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తోంది. అందుకోసం రెండేళ్లుగా ఎల్విన్‌పేట గ్రామంలో అద్దె ఇంట్లో నివాసముంటోంది. ఎప్పటిలాగే సోమవారం విధులకు హాజరై మధ్యాహ్నం వేళ తాడికొండ గ్రామంలోని పీహెచ్‌సీ వైద్యాధికారితో వర్క్ పెర్ఫార్మెన్స్ షీట్‌పై సంతకం చేయించుకునే నిమిత్తం ఎల్విన్‌పేట గ్రామ సచివాలయం-2లోని వెల్‌నెస్ సెంటర్‌లో ఎంఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తున్న స్నేహితురాలు పత్రా అనూషతో కలిసి ఇద్దరూ స్కూటీపై బయల్దేరారు. అనూష స్కూటీని నడుపుతుండగా లక్ష్మి వెనుక కూర్చుంది. మార్గమధ్యంలో కొత్తగూడ గ్రామ సమీపంలో తలకు పెట్టుకున్న టోపీ ఎగిరిపోతుండగా అనూష పట్టుకునే ప్రయత్నం చేయగా, స్కూటీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వెనక కూర్చున్న లక్ష్మి రోడ్డపై పడిపోవడంతో తల రోడ్డుకు బలంగా గుద్దుకుని తీవ్ర రక్తస్రావమైంది. అనూషకు పలు చోట్ల గాయాలయ్యాయి. అటుగా వెళ్లే వాహనదారులు వీరిని గమనించి ఆటోలో భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే లక్ష్మి మృతి చెందినట్లు వైద్యాధికారిణి రమ్య ధ్రువీకరించారు. క్షతగాత్రురాలు అనూషకు వైద్య సేవలందించారు. ఎల్విన్‌పేట ఎస్సై షణ్ముఖరావు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతురాలి తండ్రి చిన్నప్పుడే చనిపోగా, ఒక్కగానొక్క కుమార్తె అయిన లక్ష్మిని తల్లి పుష్ప చదివించి ఉద్యోగినిగా తీర్చిదిద్దింది.

దాసరివానిపాలెంలో చోరీ

కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం పంచాయతీ శివారు దాసరివానిపాలెం గ్రామంలో ఆదిమూలపు సుధీర్ ఇంట్లో ఆదివారం రాత్రి దొంగలు చొరబడి ఐదున్నర తులాల బంగారం, రూ18వేలు నగదు దోచుకుపోయారు. బాధితుడు సుధీర్, సీఐ బాలసూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎప్పటిలాగానే రాత్రి భోజనాలు ముగించుకుని సుధీర్ కుటుంబ సభ్యులంతా ఇంట్లో నిద్రిస్తుండగా పక్క గదిలో కిటికీని గునపంతో పెకిలించి దొంగ ఇంట్లోకి ప్రవేశించాడు. గదిలోగల కర్రబీరువాలో ఐదున్నర తులాల బంగారం,రూ 18వేలు నగదు దోచుకుపోయాడు. సుధీర్ సోమవారం తెల్లవారు జామున లేచి చూసి బీరువా తెరిచి ఉండడం, వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండడం గమనించారు. గదికి ఉన్న కిటికీని గునపంతో పెలికించిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపించడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. దీంతో బాధితుడు సుధీర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బాధితులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఐ బాలసూర్యారావు